ప్రత్యేక పూజలు: మాజీ మంత్రి రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆయన సతీమణి వరలక్ష్మితో కలిసి సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ అరుణ శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులున్నారు.

–బేగంపేట్, జనవరి 16

'స్వచ్ఛ తీర్థ': అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా దేవాలయాలు, తీర్థక్షేత్రాల పరిశుభ్రత కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన 'స్వచ్ఛ తీర్థ' పిలుపు మేరకు సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ఆలయ శుభ్రతలో పాల్గొన్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల ప్రతాప్, నాయకులు నరేశ్, దయానంద్, శ్రీనివాస్, నర్సింగ్ రావు, శ్రీధర్, రమేశ్, జయ, రవికుమార్, రఘు, మనోజ్‌లు పాల్గొన్నారు.

– బేగంపేట్, జనవరి 16

శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, జనవరి 16 : మాదాపూర్‌లోని శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు సందడిగా సాగాయి. సంబురాలలో భాగంగా సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా పలువురు కళాకారుల జానపద కళా ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండగ ప్రత్యేకతను చాటేలా గంగిరెద్దుల విన్యాసాలు, జంగమదేవరులు, పిట్టలదొర, హరిదాసులు, బుడబుక్కలు, కొమ్మ దాసరిల విన్యాసాలు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ప్రముఖ భరతనాట్య గురువు సంతోష్ కుమార్ తమాంగ్ శిష్య బృందం ప్రదర్శించిన భరతనాట్య నృత్యాలు ఆకట్టుకోగా, బిరాజ్ రాయ్ బృందం, పూణేకు చెందిన అంజలి రాజుల శిష్య బృందాల కూచిపూడి నృత్యాలు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపి మిఠాయి తినిపించారు.

– మియాపూర్, జనవరి 16

ఎమ్మెల్యేను కలిసిన ప్రజలు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన దూలపల్లి కౌన్సిలర్ చింతల రవీందర్‌యాదవ్

కుత్బుల్లాపూర్,జనవరి16: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మంగళవారం నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు, ప్రజలు, ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి ఇండ్లలో జరిగే పలు శుభకార్యాలకు హాజరుకావాలని ఆహ్వానపత్రికలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతన్న ఆరుకాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకొని ఎంతో సంబురంగా నిర్వహించుకునే పండుగ సంక్రాంతి అని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

సంక్రాంతి పర్వదినం సందర్భంగా మోతినగర్‌లో రంగవల్లుల కార్యక్రమం ఘనంగా జరిగింది. కాలనీలు, బస్తీలలో ప్రజలు తీరొక్క రంగులతో ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి సంబురాలు జరుపుకున్నారు. ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి.

– బాలానగర్, జనవరి 16

పతంగులు ఎగురవేసి ..

బాలానగర్, జనవరి 16 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కూకట్‌పల్లి నియోజవర్గం కాంగ్రెస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు పతంగులు ఎగురవేసి సంబురాలు జరుపుకున్నారు. సోమవారం కూకట్‌పల్లి రామాలయం పరిసర ప్రాంతాలలో స్థానికులతో కలిసి డీజేలు పెట్టి నృత్యాలు చేస్తూ, పతంగులు ఎగురవేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి యేడాది పతంగులతో సంబురాలు చేసుకోవడం సంతోషంగా ఉంటుందన్నారు. ఆత్మీయులతో కలిసి పతుంగులు ఎగురవేసి సంబురాలు చేసుకోవడం మరింత ఆనందంగా ఉంటుందన్నారు.

అంతర్గత రోడ్డు సమస్య త్వరగా పరిష్కరించాలని డీసీకి వినతి

దుండిగల్,జనవరి16:గాజులరామారం డివిజన్ పరిధి, శ్రీరాంనగర్–ఏలోని అంతర్గతరోడ్ల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ రావులశేషగిరితో కలిసి బస్తీ ప్రధాన కార్యదర్శి నవాబు, వైస్‌ప్రెసిడెంట్ శింగారం మల్లేశ్ మంగళవారం గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్(డీసీ) మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీరాంనగర్–ఏ బస్తీలోని అంతర్గత రోడ్ల పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో బస్తీ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌గౌడ్, వైస్‌ప్రెసిడెంట్ మహేశ్, సలహాదారులు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన కుత్బుల్లాపూర్‌వాసులు

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన ప్రజలు

దుండిగల్,జనవరి16: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, సంక్షేమసంఘాల ప్రతినిధులు, ప్రజలు మంగళవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపడంతో పాటు తమ బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

శబరికి బయలుదేరిన అయ్యప్ప భక్తులు

ఇరుముడి కట్టుకొని శబరియాత్రకు బయలుదేరిన భక్తులు

బాలానగర్, జనవరి 16 : ఫతేనగర్ డివిజన్ జవహర్‌నగర్‌కాలనీలోని కనకదుర్గదేవి, శీతలాదేవి, కాళికాదేవి ఆలయ పూజారి దోర్భల కాశీనాథ్‌శర్మతో సహా మరికొంత మంది అయ్యప్ప భక్తులు ఇరుముడులు కట్టుకొని శబరిగిరీశుడి వద్దకు బయలుదేరి వెళ్లారు. సోమవారం ఆలయంలో భక్తులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఇరుముడులు కట్టుకొని శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి కాశీనాథ్‌శర్మ మాట్లాడుతూ.. మండలం రోజుల పాటు అయ్యప్ప దీక్షలో ఉండి తమ మొక్కులు స్వామివారికి అందజేయడం కోసం శబరియాత్రకు బయలుదేరుతున్నట్లు తెలిపారు. 41 రోజుల పాటు నిష్టగా భక్తి శ్రద్ధలతో దీక్షను కొనసాగించి స్వామి సమక్షంలో దీక్షను విరమించడానికి శబరికి బయలుదేరుతున్నట్లు తెలిపారు. ఈనెల 17వ తేదీన శబరిలో స్వామివారి మెట్ల వద్ద నిర్వహించ దలచిన మహాపడి పూజలో తాము పాల్గొనన్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరిహారం ఇప్పించిన కౌన్సిలర్

దుండిగల్,జనవరి16: నీటిగుంతలో పడి మరణించిన ఓ వ్యక్తి కుటుంబానికి పరిహారం ఇప్పించారు దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్ దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డులోని తండా–2కు చెందిన అంగోత్ పాండునాయక్(30) ఇటీవల గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని అనుపం కంపెనీ సమీపంలోని నీటిగుంతలో పడి మరణించాడు. తన తండా(వార్డు)కు చెందిన పాండునాయక్ పరిశ్రమ నీటిగుంతలో పడిమరణించిన విషయం తెలుసుకున్న కౌన్సిలర్ శంకర్‌నాయక్, గడ్డపోతారం సర్పంచ్ కుమారుడు సాయిభరత్‌తో కలిసి మృతుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలంటూ కంపెనీ యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపారు. ఫలితంగా కంపెనీ యజమానులు రూ.50వేల పరిహారం చెల్లించేందుకు ముందుకు వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం సదరు మొత్తాన్ని మృతుడి తల్లి సక్రిబాయికి కౌన్సిలర్ శంకర్‌నాయక్ తనకార్యాలయంలో అందజేశారు.

సక్రిబాయికి పరిహారం డబ్బులు అందజేస్తున్న కౌన్సిలర్ శంకర్‌నాయక్ తదితరులు

కవులు, కళాకారుల ప్రోత్సాహానికి ఎగ్జిబిషన్ సొసైటీ కృషి

అబిడ్స్, జనవరి 16: కవులు, కళాకారులను ప్రోత్సహించేందుకు ఎగ్జిబిషన్ సొసైటీ నిరంతరం కృషి చేస్తుందని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి బి.హన్మంత రావు, కోశాధికారి ఏనుగుల రాజేందర్ కుమార్ పేర్కొన్నారు. 46 రోజులపాటు కొనసాగే ఎగ్జిబిషన్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కవులు, కళాకారులకు తగిన విధంగా సొసైటీ ఆధ్వర్యంలో సహకారాలు అందిస్తున్నామన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రసిద్ధ సాహితీవేత్త, భారత కళారత్న వడ్డేపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన కవిసమ్మేళనం అందరిని అలరించింది. ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంత రావు, కోశాధికారి ఏనుగుల ఆజేందర్ కుమార్ కళాకారులను సత్కరించి అభినందించారు. సంయుక్త కార్యదర్శి చంద్రజిత్ సింగ్, సలహాదారులు గులామ్ అహ్మద్, కన్వీనర్ ఎం. హైదర్ పాల్గొన్నారు.

తల్లీపిల్లలు అదృశ్యం

అదృశ్యమైన తల్లీపిల్లలు(ఫైల్)

కాచిగూడ, జనవరి 16 : భర్తతో గొడవ పడి ముగ్గురు పిల్లలతోపాటు భార్య అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై డి.సుభాశ్ తెలిపిన వివరాల ప్రకారం... చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన సాయికృష్ణ భార్య సునీత(39)సాయికృష్ణ, సునీత దంపతుల సంతానం చైత్ర(11) 7వ తరగతి, త్రిలోచన్(9) 4వ తరగతి, మౌనిశ్(7)2వ తరగతి చదువుతున్నా రు. నల్లకుంట డివిజన్‌లోని గాంధీనగర్(లంక)లో నివసించే తమ్ముడు విజయ్‌బాబు ఇంటికి ఈనెల 4వ తేదీన పిల్లలతో కలిసి సునీత వచ్చింది. 7వ తేదీన ఇంటికి వెళ్తున్నట్లు తమ్ముడికి చెప్పి చిక్కడపల్లికి వెళ్లలేదు. తల్లీపిల్లలు ఇప్పటికి తిరిగి రాకపోవడంతో తమ్ముడు విజయ్‌బాబు, భర్త, కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో వెతికారు. దీంతో తమ్ముడు విజయ్ బాబు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యా ప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

21న తిరుమల తిరుపతికి పాదయాత్ర

బాలానగర్, జనవరి 16 : కోట్లాది భక్తులు ఆరాదించే శ్రీ వెంకటేశ్వరుడి పవిత్ర ఏడు కొండలకు ప్రతీకగా ఏడు లక్ష్యాలను ఎంచుకొని లక్ష్య సాధన ఫౌండేషన్ స్థాపించి 10 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ నెల 21వ తేదీన తిరుమల తిరుపతి వరకు శ్రీవారికి మహాపాదయాత్ర చేపడుతున్నటు శ్రీమాన్ గట్టు అరుందతి రంగాచార్యులు, పేర్కొన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీకాలనీలో పాదయాత్ర షెడ్యూల్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 21న కేపీహెచ్‌బీకాలనీ నుంచి పాదయాత్ర ప్రారంబమై 40 రోజుల పాటు కొనసాగి మార్చి నెల 3వ తేదీన తిరుమలకు చేరుకుంటుందని తెలిపారు. పాదయాత్రలో భాగంగా ఊరూర తిరుగుతూ భగవద్గీత అందించడం, ప్రతి ఊరిలో సామూహిక గీతా పారాయణం చేయడం, ప్రతి ఊరిలో వెంకటేశ్వర కల్యాణం చేసి ముత్యాల తలంబ్రాలు ఇవ్వడం, సామూహిక సహ పంక్తి గోవింద కల్యాణ ప్రసాద వితరణ తదితర క్యాక్రమాలు నిర్వహించదలచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బైలూరు యోగీశ్‌ప్రభు, శ్రీమాన్ అచ్యుతరావు, శ్రీమాన్ తిరుపతి, ప్రభాకర్, శ్రీమాన్ బడేసాబ్, మహిళా విభాగంలో మలైవరపు భవానీలు కార్యనిర్వహణ కార్యక్రమాలు చేపడుతారని తెలిపారు.

తిరుమల తిరుపతి శ్రీవారికి వరకు చేపట్టనున్న పాదయాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న నిర్వాహకులు

జేఎన్టీయూ రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ జన్మదినం

విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్

బాలానగర్, జనవరి 16 : జేఎన్టీయూహెచ్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం జేఎన్టీయూలోని తన చాంబర్‌లో జేఎన్టీయూ యూనివర్శిటీ విద్యార్థులు కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపు కోవాలని ఆకాంక్షిస్తున్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరకటర్ ఆఫ్ పారిన్ రిలేషన్స్ ప్రొఫెసర్ వసుమతి, వనపర్తి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఇందిరరాణి, విద్యార్థి సంఘం నేతలు ఎర్రవెల్లి జగన్, ప్రవీణ్ చారి, అల్లం శివకుమార్, హరీష్, కీర్తన, విద్యార్థులు షేక్ అమీర్, సాయి తేజ, అభిషేక్, రాన్వీర్‌సింగ్, అభిజ్ఞ, రజిత, సోను తదితరులు పాల్గొన్నారు.

గదిలో దాచిన డబ్బులు మాయం

బంజారాహిల్స్,జనవరి 16: గదిలో దాచిన డబ్బులు మాయమయ్యాయంటూ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్12లోని శ్రీరాంనగర్‌లో నివాసముండే నగరం శేఖర్(30) అనే ప్రైవేటు ఉద్యోగి. ఇటీవల తన గదిలోని బ్యాగ్‌లో రూ.50వేలు దాచాడు. రెండ్రోజుల క్రితం దాచిన డబ్బు కోసం చూడగా కనిపించలేదు. తన గదిలోకి ఇంటి యజమాని బంధువు నిర్మల్ అనే వ్యక్తి అప్పుడప్పుడూ వస్తుంటాడని, అతడే డబ్బు కాజేసి ఉంటాడని మంగళవారం బాధితుడు శేఖర్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితుడిపై ఐపీసీ 380 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రహదారులు ఖాళీగా..

సంక్రాంతి పండుగ సందర్భంగా నగరవాసులు గ్రామాలకు వెళ్లిపోవడంతో రహదారులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నిత్యం రద్దీగా కన్పించే హైటెక్ సిటీ రహదారి ప్రాంతం వాహనాల రాకపోకలులేక మంగళవారం ఇలా బోసిపోయి కన్పించింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బాలానగర్, జనవరి 16 : 11 కేవీ ఫీడర్స్ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్‌లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బోయిన్‌పల్లి డివిజనల్ ఇంజినీర్ భిక్షపతి సూచనల మేరకు సెంట్రల్ బ్రేక్‌డౌన్ ఏడీఈ (సీబీడీ ఏడీఈ) పణ్యాల శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ సౌభాగ్యనగర్, ఇండోస్వింగ్ ఫీడర్ల పరిధిలోని ఐడీపీఎల్‌కాలనీ, ప్రాగా సెక్షన్, గాంధీనగర్ సెక్షన్, ఆదర్శనగర్, గిరినగర్, గాంధీనగర్, రీగల్ రెక్సొనల్, శివప్యాకింగ్ ప్రాంతంలో ఉదయం 10 గంటల నుంచి మద్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలానగర్, అక్షయ్ ఎన్‌క్లేవ్ ఫీడర్ల పరిధిలోని శివశంకర్‌నగర్, బాలానగర్, వీఆర్ఎల్ లాజ్టిస్టిక్స్, బాలానగర్ మెయిన్‌రోడ్డు, రైల్వేట్రాక్ దగ్గర, బాలానగర్ సీఐటీడీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు.

కొండాపూర్‌లో..

కొండాపూర్ : చందానగర్ వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులతో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు శ్రీదేవి థియేటర్, భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్ కాలనీ, కైలాశ్ నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి..

బంజారాహిల్స్,జనవరి 16: వృద్ధుడిపై ఎందుకు దాడి చేస్తున్నావని ప్రశ్నించిన ఓ వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మాసాబ్ ట్యాంక్ సమీపంలోని నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్న ఎన్.రాజు అనే కార్ డ్రైవర్ సోమవారం మధ్యాహ్నం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లోని సర్వీ హోటల్‌వద్దకు వచ్చాడు. గుర్తు తెలియని వ్యక్తులు అక్కడున్న ఓ వృద్ధుడిపై చేయి చేసుకుంటున్న విషయాన్ని గమనించిన రాజు వారిని అడ్డుకునేందుకు యత్నించడంతో గొడవ తలెత్తింది. మాటామాట పెరగడంతో మరికొంత మంది వ్యక్తులు అక్కడకు చేరుకుని రాజు మీద దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.